

# శ్రీ భక్తి సంజీవని

ఇది భక్తిజ్ఞాన కర్మయోగములఁ దెలుపు మాసపత్రిక.

ప్రతి హూణమాసారంభంబున వెలువడుచుండును.
విలేఖకుఁడు-ప్రకాశకుఁడు, వావిలికొలను-సుబ్బరావు,
(వాసుదాసుఁడు) ఒంటిమిట్ట.

"భక్తిరేవైనం గమయతి, భక్తి రేవైనం దర్శయతి
భక్తివశః పురుషః ॥" మా. శ్రుతి.
భక్తియే భగవంతుని బొందించును, ఆయనను దర్శింపఁజేయునది
భక్తియే, భగవంతుఁడు భక్తివశుఁడు.



| సంపుటము 6 | 1934వ సంవత్సరము మర్చి నెల<br>శ్రీముఖనామ సం॥ ఫాల్గున మాసము. | సంచిక 3 |
|---|---|---|



## శ్రీరామానందలహరి

గీ. మానవావళికిని బోలెక్ష్మాకళత్ర
సూక్ష్మమును గారణంబును స్థూలమనెడి
దేహములులేమి నిన్ను నిర్దేహుఁడంద్రు
నీకుఁ జైతన్యమే మేను నీరజాక్ష.

శ్రీ రామ.

## భక్తివిజయము.

(గతసంచికాశేషము 77వ పుట చూడు.)

**శు. వే. ప్రశ్న :-** ఓయీ ! నీ మతసిద్ధాంతమునకుఁ బ్రమాణ గ్రంథములేవి? శ్రుతులా? స్మృతులా? ఇతిహాస పురాణములా?

**ఉ :-** శ్రీ రామానుజ గీతాభాష్యమునకుఁ బీఠిక వ్రాసిన యద్వైతులు మారులకర శంకరశాస్త్రులవారే యిట్లు వ్రాసియున్నారు.

**"అయంచ విశిష్టాద్వైత వాదః ప్రథమం పరాశరేణ శ్రీవిష్ణుపురాణే ప్రతిపాదితః । తదనంతరంచ పారాశర్యేణ మహాభారత, శారీరకసూత్రాది షూపవర్ణితః । తతశ్చబోధాయ నేన మునినా వృత్తిగ్రంథే విస్తృతః । అథచ టంకద్రమిడాది భిర్ద్రమిడ భాషాదిషు సంగృహీతః । ఏవంయుగాంతరే ప్రచుర ప్రచారోప్యయం కలియుగే శ్రీపరాంకుశ, నాథ, యామునమునిభిః ప్రవర్తితః, రామానుజాచార్యైశ్చ కుమతి కల్పిత త్రివిధ కుతర్క శుష్క తృణ వ్రాత్యాచక్రాయ మాణసుయుక్తి వ్రాత పరివృతేన శ్రీమద్వ్యాఖ్యా ప్రబంధేన సమ్యక్ప్రతిష్ఠాం నీతశ్చ"** అర్థము.

ఈ విశిష్టాద్వైతమతము బ్రహ్మతత్త్వము నీకు యథాసత్యముగా గోచరించునని బ్రహ్మచే వరము పొందిన పరాశరమహర్షి విష్ణుపురాణమునందు (పురాణములందుఁ బురాతనమైనది) ప్రతి పాదించెను. ఆవల నారాయణు నవతారమగు వేదవ్యాస మహర్షి మహాభారత బ్రహ్మసూత్ర భగవద్గీతా పురాణములందు వర్ణించెను. ఆవల నాయన శిష్యుఁడు బోధాయన మహర్షి వృత్తి రచించి విస్తరింపఁజేసెను. ఆవలఁ దంక ద్రమిణాదులు తమ ద్రావిడ భాషాగ్రంథములందు సంగ్రహించిరి. ఈవిధముగ యుగాంతరమందు నిది విస్తారముగఁ బ్రచారమందుండెను. కలియుగమందు శ్రీపరాంకుశ, నాథముని యామునాచార్యులు మొదలగు మునులచేఁ బ్రపర్తితమయ్యెను. శ్రీరామానుజాచార్యులో కుమతులు కల్పించిన మూఁడువిధకుతర్క ములనెడి యెండిన గడ్డిపోఁచలకు సుడిగాలి చక్రమువంటి సుయుక్తి సమూహముచేఁ గూడిన శ్రీమద్వ్యాఖ్యా ప్రబంధముచే దృఢముగఁ బ్రతిష్ఠించెను.

ఇది యిట్లు పరంపరాగతమనియుఁ బూర్వులు చెప్పిన దాని ననుసరించియే తానుభాష్యము రచించెదనని శ్రీరామానుజాచార్యులవారు శ్రీ భాష్యముఖమున నిట్లు సెలవిచ్చిరిగాని గురుపరంపరలేక గురువుపేరు చెప్పక భాష్యము వ్రాసిన వారుగారు.

**పారాశర్య వచస్సుధా ముపనిషద్దుగ్ధాబ్ధి మధ్యోద్ధృతాం**
**సంసారాగ్ని విదీపన వ్యపగతప్రాణా త్మ సంజీవనమ్**
**పూర్వాచార్య సురక్షితాం బహుమతి వ్యాఘాతదూరస్థితా**
**మానీతాం తు నిజాక్షరై స్సుమనసో భౌమాః పిబంతన్వహమ్.**

భగవద్బోధాయన కృతాం విస్తీర్ణాం బ్రహ్మసూత్ర వృత్తింపూర్వాచార్యా సంచిక్షిపుః । తన్మతానుసారేణ సూత్రాక్షరాణి వ్యాఖ్యాస్యంతే ॥ అని వ్రాసిరి. కావున నిది శ్రీరామానుజాచార్యులవారు స్వబుద్ధిబలముచేఁ గల్పించినది కాదు.

**ప్ర :-** జీవుఁడని ప్రకృతియని యీశ్వరుఁడని గ్రహించుట నానాత్వ మంగీకరించుట కాదా.

**ఉ :-** అ మూఁడు కలిసి యొకవస్తువే యని చెప్పితిని గదా. ప్రపంచమంతయు నాయొకవస్తువే. అదితప్ప వేఱులేదు. సావరఁ బంగారులో రెండుమూఁడు లోహములు కలసియున్నవికదా దానిని మూరెఁడు పొడుగునఁ గమ్మిగాఁ గొట్టినను, తునుకలుగా జేసినను ఆవస్తువుగాక వేఱేయున్నదని నానాత్వము చెప్పవచ్చునా?

మట్టివిత్తనము చెట్టైనట్లు జీవ ప్రకృతులతోఁ గలిసి యొకటిగానున్న బ్రహ్మమే ప్రపంచముగా నయ్యెను. ఇందేమి దోషముగలదు. విష్ణుపురాణ మిట్లు చెప్పుచున్నది. భగవద్గీతయందు, 7 అధ్యా. 4-5.

**భూమిరాపో నలవాయుః ఖంమనో బుద్ధిరేవచ**
**అహంకార ఇతీయంమే భిన్నా ప్రకృతిరష్టధా.**
**అపరేయ మితస్త్వన్యాం ప్రకృతిం విద్ధిమేపరామ్**
**జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతేజగత్**

భూమి జలము అగ్ని వాయువు ఆకాశము మనస్సు బుద్ధి అహంకారము అను నాప్రకృతి యెనిమిది విధములు. ఇది నా ప్రకృతి యనినపుడు ప్రకృతి వేఱు తానువేఱని చెప్పినట్టాయెఁగదా తరువాత మీఁదఁ జెప్పునది యచేతన ప్రకృతి. అది నికృష్టమైనది. ఏల? నా ప్రకృతి మఱియొకటిగలదు. అది జీవస్వరూపమైనది. దానిచే జగత్తు (అచేతన ప్రకృతి) ధరింపఁ బడుచున్నది. కావున దానికంటె నీచేతనే ప్రకృతి యుత్కృష్టమైనది.

జీవస్వరూపమైన ప్రకృతి నాది యన్నప్పుడు జీవాత్మలకంటెఁ బరమాత్మ భిన్నుఁడని యంగీకరింప వలయునుగదా.

**ఏతద్యోనీని భూతాని సర్వాణీ త్యుపధారయ**

భూతముల కన్నిటికి నీరెండును జన్మకారణములని యెఱుంగుము.

**శ్లో. ద్వావిమౌ పురుషౌలోకే క్షరశ్చాక్షర ఏవచ**
**క్షరస్సర్వాణి భూతాని కూటస్థోక్షర ఉచ్యతే**
**ఉత్తమః పురుషస్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః**
**యోలోకత్రయమావిశ్య బిభర్త్యవ్యయ ఈశ్వరః**
**యస్మాత్క్షర మతీతోహ, మక్షరా దపిచోత్తమః**
**అతోస్మిలోకే వేదేచ, ప్రథితః పురుషోత్తమః. భ. గీ. 25; 16-17-18.**

క్షరుఁడని యక్షరుఁడని పురుషులు రెండు విధముల వారు గలరు. వీరికంటె నుత్తముఁడు పరమాత్మ యనఁబడును. అతఁడీశ్వరుఁడు. లోకత్రయ మావరించి భరించుచున్నాఁడు. క్షరమునకంటె నక్షరమునకంటె నతఁడుత్తముఁడగుటచే నన్నుఁ బురుషోత్తముఁడందురు. దీనివలన మూఁడుతత్త్వము లేర్పడెనుగదా.

ఈయాక్షేప సమాధానము లటుండనిండు. వీనితోఁ గాలక్షేపము చేయలేను. మీయాక్షేపములు మా సమాధానము లిదివఱకే గ్రంథస్థము లైయున్నవి. మీకు శ్రద్ధగలదేని యాగ్రంథములఁ బఠింపుఁడు. నేను భక్తిమతము గుఱించి చెప్పబూనినవాఁడను. భక్తిమార్గమే శ్రేష్ఠమార్గమని భాగవతమతము. దానికాధారము లన్నిమతములనుండి గ్రహించెదను. ఒక్కటియని నాకుఁ బట్టుదలలేదు. ఓరి శుష్క వేదాంతి అదికాదని చెప్ప నీ కెన్ని గుండెలుగలవు? అన్ని మతములు నీశుష్క వేదాంతమును ఖండించునవే. ఏమతము చెప్పినను, ఏమతము చెప్పకున్నను భక్తికి ప్రకృతి, జీవుఁడు, ఈశ్వరుఁడు ముఖ్యములు కావున వానిని గ్రహించెదను. వీనిని గ్రహించినది వేదసమ్మత సన్మతము. అదికానిది దుర్మతము. భక్తిహీనమత మొకమతమా?

ఈమతమందు భక్తిచేయువాఁ డొకఁడు చేయించుకొనువాఁ డొకఁడు వీరిరువురు లేకున్న, కర్మయోగ ము లేదు. జ్ఞానయోగములేదు. అష్టాంగయోగము లేదు. రాజయోగము లేదు. ప్రపత్తిలేదు. శంకరాచార్యుల వారి ప్రవృత్తిమార్గనిష్ఠలేదు. లోకులందఱు కర్మభ్రష్టులు సన్న్యాసులు శూన్యవాదులై మీవలె పాడై పోవలయును. వివేకము గలవాఁ డెవ్వఁడును దీనినామోదింపఁడు. భక్తిమార్గమును మీ శూన్యవాదు లంగీకరింపకుండిన వ్యసనము లేదు. శంకరాచార్యుల వారంగీకరించి యున్నారు. భక్తిమతప్రకారము సేవించువాఁడు మనుష్యుఁడు సేవింపఁబడువాఁడు భగవంతుఁడు. మనుష్యునందు రెండుపదార్థములు గలవు. ఆత్మయొకటి, శరీర మెకటి ఈవిధముగఁ జూచినఁ బ్రకృతి (దీనికే మాయ యని పేరు) పురుషుఁడు (ఈయనయే యాత్మ) ఈశ్వరుఁడు (ఈయనయే బ్రహ్మమని పరబ్రహ్మమని పరమాత్మయని నారాయణుఁడని చెప్పఁబడువాఁడు) ఈమూఁడు తత్త్వముల నంగీకరింపక తప్పదు. ప్రకృతి మాయయనుది భగవచ్ఛక్తి - జీవుఁడనువాఁడు భగవదంశము. శక్తుఁడు భగవంతుఁడు సత్యమాయెనా శక్తియుసత్యమే. అంశి భగవంతుఁడు సత్యమాయెనా యంశము జీవుఁడు సత్యమే. ఈకారణముచే సత్యములైన రెంటివలన నేర్పడిన యీ ప్రపంచము సత్యమే.

శరీరమునకు ఆత్మవలె, జీవునకు భగవంతుఁ డాత్మయై యున్నాఁడు. ప్రకృతి, పురుషుఁడను రెండు పదార్థములచే భగవంతుఁడు ప్రపంచము సృష్టించెను. సూక్ష్మముగ నున్నది స్థూలముగఁ బరిణమించు టయే సృష్టి.

దేహముయొక్క ధారణపోషణములకు జీవాత్మ యెట్టులో యట్టులే జీవాత్మకుఁ బరమాత్మ. ఆకారణము చేఁ బ్రకృతి పురుష లిరువురు భగవంతునకు శరీరమని చెప్పఁబడెను. ఫలముగోరి పుణ్యాపాపకర్మములు చేసిన జీవులను వానిఫలమనుభవించుటకై ప్రకృతి పరిణామములైన శరీరములందు భగవంతుఁడు ప్రవేశపెట్టు చున్నాఁడు. కావున సకామకర్మముల మాని నన్నిఁక నీశరీరములందుఁ ద్రోయవలదనియు నీవు నాకుఁ దండ్రివి కావున నీసేవయందే యుంచుకొమ్మని ప్రార్థించుటే ముక్తిహేతువు. వీనికన్నిటికిఁ బ్రమాణవాక్యములను నీభక్తివిజయము ననుబంధమున నీమార్గమున నుండు వారికిఁ దెలియుటకై వివరించెదను. చూచి నీకుఁ

దృప్తికరముగా నుండెనా భక్తిమతములోఁ బ్రవేశింపు - లేదా శూన్యమతములోఁ బ్రవేశింపు. తెలిసి బుద్ధిపూర్వకముగ నీవేమి చేసినను నీకైవిచారపడను. తెలిసి తెలిసి పాడుబావిలో దుముకు వాని నెవరడ్డ గింపఁగలరు. దానిలో నేదో నిక్షేపమున్నది. కావున నీవు దూఁకితివని తెలివిలేనివారు మోసపోయి దూఁకి తలలు పగులఁగొట్టుకొనక యుండవలెను. శుష్క వాదములచే నాకాలము వ్యర్థముచేయుకము నాపని నన్నుఁ జేసికొననిమ్ము, నీకుఁ బుణ్యముండును. నీమతప్రకార మీతత్త్వవిషయము మాటలాడుటకే నీ కధికారము లేదే ఏల మతభ్రష్టుఁడవు, గురుద్రోహివయ్యెదవు.

వర్తకుఁడు రాత్రి వేళఁ దనయింటిలోఁ బ్రత్యేక విభజనములేక యొకటిగానున్న పదార్థముల నుదయ కాలమున వేఱువేఱు గంపలలోనుంచి ప్రత్యేక ప్రత్యేకముగా నెట్లు నలువురికిఁ గానవచ్చునట్లుంచునో యట్టులే భగవంతుఁడు చేయును. దానికి సృష్టియనిపేరు. సృష్టియనఁగా విడువఁబడునది యని యర్థము.

**సర్వభూతానికౌంతేయ ప్రకృతిం యాంతిమామికామ్**
**కల్పక్షయే పునస్తాని, కల్పాదౌ విసృజామ్యహమ్.**
**ప్రకృతి స్వా మధిష్ఠాయ విసృజామి పునః పునః**
**భూతగ్రామ మియం కృత్స్న, మవశం ప్రకృతేర్వశాత్. భ. గీ. 9-7-8.**

కాని ప్రపంచము నూతనముగాఁ గల్పింపఁబడినదనికాదు.

తొలుత బాలుఁడు కేవల మజ్ఞుఁడైయుండి యావలఁ గొంచెము తెలివితోఁ గార్యములు చేయఁగలిగి వయస్కుఁడై యనుభవజ్ఞుఁడై యావల జ్ఞానసంపన్నుఁడెట్లగునో యట్లేజీవుడు తొలుతఁ దమోగుణముగల వాఁడై యావల రజోగుణము గలవాఁడై యావల సత్త్వగుణము గలవాఁడగును. ఈక్రమమునే పరిణామ మందురు. ఇప్పుడు చతుర్ముఖబ్రహ్మ యనఁబడువాఁడుకూడ నొకానొక కాలమందు గాఢ తమస్సులో మునిఁగియుండి కాలక్రమమునఁ బరిణామము చెంది - చెంది యిప్పుడు బ్రహ్మయయ్యెను. అట్టులే జీవు లందఱు నిప్పుడెంత యధమస్థితిలో నున్నను గొంతకాలమునకు నీలోపల మోక్షమునకుఁ బోరేని క్రమమార్గ మున బ్రహ్మలగువారే?

ఇటులైనచోఁ బాషాణరూపమునఁ గేవలము గాఢ తమస్సుతో మునిఁగిన జీవుఁ డేమిచేసి బ్రహ్మ పదవి నలంకరించెనను ప్రశ్న పుట్టకపోదు. దానికిఁ బ్రత్యుత్తరము సేవయే. బ్రహ్మగా నున్నవాఁడు మోక్షమున కుఁ బోవుటకు సేవయే కారణము. అదెట్టులో నిఁక వివరించెదను. ముందు వివరించిన, భ. గీ. అ, 7. శ్లో. 4-5-6.

**ఏతోద్యోనిని భూతాని సర్వాణీ త్యుపధారయ**

... ... ... ....

యను శ్లోకములవలన భూతసృష్టియంతయుఁ బ్రకృతి పురుష సంయోగమువలననే కలిగినదని యేర్పడెను. ఇట్లు చూచినఁ బ్రపంచమందలి ప్రతిపరమాణువునందుఁ బ్రకృతి, జీవుఁడు, అంతర్యామియగు నీశ్వరుఁడు నుండునట్లంగీకరింప వలయును. ఇట్టులేర్పడిన ప్రతి శరీరి శరీరమందుఁ బ్రకృతి గుణములు సత్త్వము రజస్సు తమస్సు గలిసియుండును గాని యొక్క గుణముమాత్ర ముండదు. రెండు నుండవు. అయినను నన్నిటియం దీమూఁడు సమానముగా నుండవు. తొలుత బారువ తమస్సు ఆవగింజంత సత్త్వ ముండెనేని క్రమక్రమముగఁ బైతరగతులకుఁ బోవుకొలఁది తమస్సుతగ్గుచు సత్త్వము హెచ్చుచుఁ దుదకు బారువ సత్త్వము ఆవగింజంత తమస్సుగా నేర్పడును. ఈ మార్పంతయు గుణము లందని యెఱుంగవల యును, గుణి (గుణముకలది) లేక గుణముండదు. తెలుపు లేక పాలుండదు. కావున నీగుణము దేహము నాశ్రయించి యుండును. కావునఁ బ్రకృతిగుణమున్న చోట దేహముండక తప్పదు. ఈదేహము లన్నియుఁ బాంచభౌతికములు అనఁగా భూమి, జలము, తేజస్సు (అగ్ని) వాయువు ఆకాశమను నైదు భూతముల కలయిక వలన నైనదే. ఈయైదు లేని దేహమే లేదు. పాషాణమందు నీయైదున్నవి. బ్రహ్మశరీరమందు నీ యైదునున్నవి. పాషాణములందుఁ బృథివీభూతము విశేషించియున్నది. దేవతలందుఁ దేజోభూత మెక్కు వ - పృథివీ భూతము విశేషించి యుండు చోటఁ దమోగుణము విశేషించియుండును. ఒకటితగ్గిన రెండవది తగ్గును. ఒకటి హెచ్చిన రెండవది హెచ్చును.

మన ప్రపంచమునఁ గానవచ్చు పదార్థములలోఁ బాషాషములు లోహములు మొదలగువానియందుఁ బృథివీభూత మెక్కువ. కావునఁ దమోగుణమెక్కువ. వీనిలోను జీవుఁడు కుండలోనుంచిన దీపమువలెఁ బ్రకాశరహితుఁడై యున్నాఁడు. వీనిలో జీవుఁడున్న కారణముచేతనే వీనికి బాధకలిగినపుడు దుఃఖము

మూర్ఛ మరణము లోనగు నవస్థలు కలవు. కొందఱు ప్రకృతి శాస్త్రజ్ఞులు కొండలు పెరుఁగుచున్నవనియు వ్రాసినారు. వీని నంతస్సంజ్ఞములని మనశాస్త్రములు చెప్పుచున్నవి. అంతస్సంజ్ఞమనఁగా వీనికిఁ దెలివి లోపలనున్నది కాని వెలికిఁ గానరాదని యర్థము. వృక్షాదు లిట్టివే. వీని నవ్యక్త చైతన్యములనియు నందురు. అనఁగా స్పష్టముగాఁ దెలియరాని ప్రాణచిహ్నములు గలవని యర్థము. ఈకారణములచేత నివి తమపురోవృద్ధికి నేకార్యము శిశువులవలెఁ జేయఁజాలవు. ఆకారణముచే శిశువుల నెట్లు తల్లు లేవేశకు నీళ్ళుపోసి పాలిచ్చి పోషించి వృద్ధికిఁదెత్తురో యట్టులే వీనిని పెంచుభారమును దనయందుంచుకొని భగవంతుఁడు వీనిచేత సేవచేయించును. వీనికిఁ గాళ్ళులేవు, చేతులులేవు, ఏమిసేవసేయునని తలఁపవలదు. ఈఱాలనే మనుష్యుల కుపయోగపడునట్లు భగవంతుఁడు చేయును. వాని నట్లుపయోగించుకొను బుద్ధి భగవంతుఁడే మనుష్యుల కిచ్చును. ఆ కారణమున నారాలు మనయిండ్లకు గోడలైకాని మఱియొక విధముగఁ గాని బండలై మనకుఁ గూర్చుండుటకు నుపయోగించి గాని మనసేవ చేయును. కొన్ని రాలిండ్లకుఁ గొన్ని దేవాలయములకుఁ గొన్ని మనుష్యులు పండుకొనుటకు నీ విధముగ నేవిధముగనో మనుష్యుల కుపయోగపడును. అవి ప్రతిఫల మపేక్షింపవు. మనుష్యుల కుపయోగపడి వారికానందము గలుగఁ జేసిన పుణ్యము కొంచెమైనను గొప్పయైనను వ్యర్థముపోదు. ఇట్టులే కొంచెము కొంచెము పుణ్యము సంపాదించి జన్మాంతకములఁ బైపై మెట్టునకుఁ బోయి తుద కాజాతిలోనే యుత్తమ జన్మములెత్తి లింగములుగను సాలగ్రామములుగను జన్మించును. వజ్రములు, కెంపులు, పుష్యరాగములు లోనగునవిరాలేకదా.

ఇట్లు పాషాణజాతిలో నెన్ని తరగతులున్నవో యన్ని తరగతులు దాఁటి పోయి పోయి తుదకు వానిలో నుత్తమ జన్మములెత్తి లోకులకుపయోగపడి యా పుణ్యబలమున వ్యక్తచైతన్యములం దధమజాతిలోఁ బుట్టును. వీనినే యుద్భిజ్జములందురు. ఉద్భిజ్జమునఁగా ఉత్ + భిత్ + జములు = పెకలించుకొని పుట్టునవి యని యర్థము. ఇవి గడ్డిగాదము మొదలైనవి. ఇవి పశువుల కాహారమయియో మనుష్యుల కౌషధములలోఁ గలిసియో యేవిధముగనో లోకుల కుపకారపడి యాపుణ్యమున నాజాతులందుఁ బైపై తరగతులకుఁ బోవును. ఇట్లు గడ్డిగానుండినవే చిన్నచిన్న మూలికలై తీఁగలై సామాన్య వృక్షములై ఫలవృక్షములై జనులసేవ సేయును. వీని యాకులు, పూలు, కాయలు, పండ్లు, కొమ్మలు, బోదెలు, వేళ్ళు అన్నియు లోకుల కుపయోగించునవే. ఈ చెట్ల నీడలందుఁ బండుకొని మన మానందింతుము. తుదకవి చచ్చియెండి కట్టెలై మన కన్నముచేసికొనుట కుపయోగించును. మనుష్యశరీరము దేనికిఁ గొఱగాదు గాని యవన్నియుఁ బ్రదికియుఁ జచ్చియు లోకుల కుపయోగపడునవే. ఇట్లు పరిణామము చెందిచెంది తుదకు వృక్షజాతిలో నుత్తములైన కల్పాది వృక్షములైపుట్టి యక్క డను బరోపకారముగ జీవించి యావలి జన్మముల స్వేదజములుగాఁ బుట్టును. స్వేదజములనఁగాఁ జెమటయందుఁ బుట్టినవి. వీనికే యూష్మజము లనియుఁబేరు. అనఁగా వేఁడినీటి యావిరి, తలలోనిమన్ను కలిసినపు డివి జన్మించును. మీఁదఁజెప్పినట్టు లివియుఁ బరోపకారకములై యావల నండజములుగా జన్మించును.

అండజములనఁగా గ్రుడ్లయందుఁ బుట్టునవి. కోడి గ్రుడ్లు, బల్లి గ్రుడ్లు లోనైనవి. వీనియందుఁ బుట్టునవి పక్షులు చేఁపలు నీతరగతిలోఁ జేరినవే. ఇవియును మనుష్యుల కాహారముగనో యౌషధములకో యితర జంతువులకో యుపయోగపడి యాపుణ్యవశమున జరాయుజములుగాఁ బుట్టును. జరాయుజములనఁగా మావునందుఁ బుట్టునవి. ఆవులు, మనుష్యులీ తెగలోఁ జేరినవారే. మనుష్యజన్మము వచ్చువఱకుఁ బ్రతి జీవియుఁ బరుల కుపకారపడియె వృద్ధికి వచ్చెను. ఈవిధముగ మనమెన్ని జన్మములెత్తి యీ జన్మమునకు వచ్చితిమో తెలియదు. మనలో నున్నజీవుఁడు మొట్టమొదటఁ బ్రకృతియను వేశ్యవలలో నెప్పుడు పడెనో తెలియదు. ఆనాఁడు మొదలు నేఁటివఱకు దానివలలోఁ బడి మిణుకరించుచున్నాఁడు. సరాసరి యొక్క జన్మమునకు నూఱుసంవత్సరములని లెక్క పెట్టినను నీ బ్రహ్మకల్పమునందే 448112000000 ఇన్ని జన్మము లెత్తియున్నాము. కొన్నిజన్మములందనఁగా వృక్షజాతిలోను కీటకములుగాను అల్పమృగములుగ నున్నప్పుడును అల్పకాలమే జీవించితిమి గావున మీఁదఁజెప్పిన సంఖ్యకంటె నెక్కువ జన్మములే యెత్తియుండవలయును. పోయిన బ్రహ్మకల్పమందు మనమెత్తిన జన్మములు 8956224000000. ఈ ప్రకారము చూచిన నేఁటికెన్ని బ్రహ్మకల్పములు గడచినవో యెన్నిజన్మములెత్తితిమో చెప్ప బ్రహ్మకును సాధ్యముగాదు. భగవంతునకు మాత్రమే సాధ్యము. ఆయన యొక్కఁడే మనజీవిత చరిత్ర యంతయు నెఱుఁగును.

నందులు, పందులు, కుక్కలు, నక్కలు, నల్లులు, బల్లులు, పిల్లులు, పాములు, తేళ్ళు, పులులు, సింహములు, తోడేళ్ళు, గొఱ్ఱెలు, బఱ్ఱెలు, ఇవియవి యననేల యివియన్నియు మన మొక కాలమున

ధరించిన దేహములే. ఇప్పు డవి చేయు చేష్టలన్నియు మనము చేసినవారమే. ఏదియో పుణ్యపరిపాకమున నిప్పటి మనుష్యస్థితికి వచ్చితిమి. ఈ మనుష్య దశయందు మనము మనుష్యులవలె వర్తించి మోక్షమునకుఁ బోయినను బోవచ్చును. స్వర్గమునకుఁ బోయినను బోవచ్చును. మహర్షిలోకమునకో బ్రహ్మలోకమునకో పోయి యచ్చటనుండి ముక్తిని జెందినను జెందవచ్చును. లేదా మరలఁ బశువులుగానో పక్షులుగానో చెట్లు గానో పుట్టవచ్చును. మనుష్యజన్మమునకంటెఁ దక్కువజన్మంబులం దధఃపతనములేదు. పశువులుగాఁ బుట్టినవి మఱుజన్మమునఁ జెట్లుగాఁ బుట్టవు. మనుష్యునకో యట్టి యధోగతులు గలవు. ఏల?

బిడ్డలకు యుక్తవయస్సు వచ్చువఱకుఁ దల్లిదండ్రులు వారి దేహస్థితులు కనిపెట్టి యే యాహారమెంత యెప్పుడిచ్చిన వారి కారోగ్యము చెడుకుండునో బలమువచ్చునో తెలసి వారే యిచ్చుచుందురు. ఆ భారము వారియందున్నది. యుక్తవయస్సు వచ్చి బుద్ధితెలిసినవాఁ డయినతరువాత నాభారము వారియందుంచు కొనరు. అట్లులే భగవంతుఁడును మనుష్యదశకు వచ్చిన జీవివిషయమున వర్తించును. మనుష్యుఁడనఁగా నాలోచించు జ్ఞానముగలవాఁడు ఆకారణముచే నదిమంచి యిది చెడ్డయని తెలిసికొని వర్తించు బుద్ధియుఁ దెలివియు వానికిఁగలవు. వానికేది మంచిది యేదిచెడ్డది. కార్యమేది యకార్యమేది పుణ్యమేది పాపమేది యని తెలిసివర్తించుటకుఁగాను శాస్త్రముల నేర్పఱిచి యిచ్చి యాప్రకారము వర్తింపుఁడని చెప్పెను. అందు అధర్మముల విడిచి ధర్మములే చేసిరేని బాగుపడుదురు. అధర్మములు చేసిరేని చెడి యధోగతులకుఁ బోదురు. ఉత్తమగతులకుఁ బోవుటకు నధమగతులకుఁ బోవుటకు మనుష్యులే యుత్తర వాదులు గాని భగవంతుఁడు గాఁడు. ఆయన వారుచేయు కార్యములకుఁ దగిన ఫలమిచ్చుచుండును. ఆయన కృత్యమంతయే.

మనుష్యులు సేవచేతనే తరించి పోవలయునని భగవత్సంకల్పము. పశువులుగాను పక్షులుగాను వృక్షములుగాను నున్నప్పుడు జీవులెట్లు పరులకుయోగపడుచుండిరో యిపుడు తొలుతొల్త నట్లే యుపయోగ పడవలెను. అనఁగా లోకసేవతోఁ బ్రారంభింపవలెను. లోకసేవయనఁగాఁ బ్రతిఫలాపేక్ష లేక లోకులకుఁ బ్రేమతో నుపకరించుటేగాని లోకసేవ లోకసేవయని గంతులుపెట్టుటగాదు. లోకస్తు భువనేజనే యని లోక శబ్దమున భూతకోటి యని యర్థము. పశుజాతిలోనున్న జీవులను దొలుత మనుష్యజాతిలోఁ బుట్టించునపుడు వానివాని గుణములు కర్మము లెట్లున్నవో వాని ననుసరించి నాలుగు వర్ణములయందుఁ బుట్టించును. పులులు, సింహములు, తోడేళ్ళ గుణములు ఆవులు, జింకలు, మేఁకలు మొదలగువాని గుణములు సమానములు గావుగదా. ఆజీవులను నీజీవులను నొక తెగలో నెట్లుపుట్టింపగలదు. ఈకారణముచేతనే **'చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మవిభాగశః"** యని భగవంతుఁడు తానే నాలుగువర్ణములు సృష్టించితినని చెప్పెను. అటుగాకున్న వానివాని పూర్వజన్మకర్మము లెఁవడెఱుఁగును? ఇట్లు నాలుగు విభాగము లేర్పడినపిమ్మట వెనుకవచ్చు జీవులను వారివారి గుణకర్మములను బట్టి యేతరగతిలోఁబుట్టింపవలయునో యాతరగతిలోఁ బుట్టించుచుండును. కావుననే **"దైవాయత్తం కులేజన్మ"** యని చెప్పఁబడుట. ఒకకులమందుఁ బుట్టుట దైవాయత్తమే కాని స్వాయత్తమయిన కార్యముగాదు. ఈవిభాగము కొందఱు తలఁచునటు లీ జన్మము గలిగిన తరువాత జరుగునవికావు. ఇప్పుడో శాస్త్రముల నుల్లంఘించి స్వధర్మముల నేటఁగలిపి చరించుటచే వర్ణసాంకర్య మేర్పడినది.

ఒక బ్రాహ్మణుఁ డుత్తమగుణములు కలవాఁడై బ్రాహ్మణ ధర్మం దుండువాఁడైనను వానిభార్య వ్యభిచరించునేని వారికి నుత్తమ బ్రాహ్మణుఁడుగాఁ బుట్టఁదగిన జీవుఁ డెట్లుపుట్టును? తక్కు వజాతివాఁడే పుట్టును. ఈవిధముగ వర్ణసాంకర్యము స్త్రీలవలన జరగును. అట్టులే బ్రాహ్మణుఁడు శూద్ర స్త్రీతో సంగమించె నేని సద్బ్రాహ్మణుఁడెట్లు వారికుదయింపఁ గలఁడు? ఇప్పుడు విచారింపవలసిన విషయమిదిగాదు. కావునఁ బ్రకృతమనుసరింతము. ఇట్లు పుట్టిన నాలుగు వర్ణములవారును సేవచేతనే తరింపవలయును. అది కొనసాగుటకు వృత్తులేర్పఱుపఁ బడినది. పరిణామమువలననే మనుష్యులందు వర్ణములేర్పడెను.

శూద్రులకు వృత్తి మూఁడు వర్ణములవారికి సేవచేయుట యని చెప్పఁబడెను. అనఁగానేమి? అందఱు శూద్రులు తక్కి నయందఱకుఁ గాళ్ళుపిసుకవలయునని యర్థమా? కాదు. ఏవృత్తిలేనివా రాపని చేయవలయును. ఈతరగతివారియందుఁ దమస్సెక్కు వ. సత్త్వము తక్కు వ.

కొందఱు పైర్లుపెట్టి పండించి ధాన్యమును మనుష్యుల కాహారముగ నిచ్చి లోకసేవ చేయుచున్నారు. వీరు దాన్యమును బండింపక పోయినయెడలఁ దక్కి న మనుష్యులందఱు నేమితిందురు? ఆహారము కల్పనము చేయుటకంటె గొప్పలోక సేవయేది? వారు ధర్మార్థముచేయుచున్నారా యందురేమో? ఇప్పుడు వారు కామదాసులై ధనదాసులైనారు కానిండు. అట్లయిన ధర్మఫలము వారికి లేకపోవునుగాని యితరుల

కుపకారము చేసినవా రగుదురా కారా? ఆపైరుపెట్టువారు తమ గృహకృత్యముల కెంత కావలయునో యంతమాత్రమే పండించుకొని కూర్చుండినఁ దక్కి నవా రేమితిందురు? అట్టులే చాకల, మంగల, సాలె, కంసాల మొదలయినవా రందఱు లోకసేవ చేయువారే. ధర్మబుద్ధి మాత్రమేలేదు. మనయిండ్లు మనము కట్టుకొంటిమా? మన బావులు మనము త్రవ్వుకొంటిమా? మనగుడ్డలు మనము నేసికొంటిమా? పూర్వము వీరందఱు నొకరికొకరు సహాయము చేయువారే. ధాన్యముగల వాఁ డాయూర నుండువారికి ధాన్యమిచ్చిన వానికిఁ దమసహాయము కావలసినపుడు వారూరకయె వానికిఁ గావలసినపని చేయుచుండిరి. వడ్లవాఁడు సాలెవానికి సాహాయ్యము చేసిన సాలెవాఁడు వడ్లవానికి సహాయము చేయును. ఈవిధముగ నొక గ్రామ మంతయు నొక కుటుంబముగ నుండుచుండెను. ప్రభువులు నౌకరీ ఇనాములని పనివాండ్రకు మాన్యములిచ్చి వారిచే నాయా గ్రామజనులకుఁ గావలసిన పనులు చేయించుచుండిరి. పూర్వము రాత్రులందు వాకిండ్లు తెఱచి నిద్రించువారు. గ్రామాధికారి తెల్లవాఱువఱకుఁ బ్రహరి తిరిగి దొంగతనము లేకుండ రక్షింపవలెను. అటుగాక యతని సోమరితనమువలననో యజాగ్రత్తవలననో యెవరి యింటనైన నేదైనసొత్తు పోయెనా దానిని గ్రామాధికారి తెచ్చి యియ్యవలెను. లేదా వాఁడు దానివెలయో యట్టివస్తువో తెచ్చి యియ్యవలెను. ఇప్పుడో కంచే చేనుమేయుచున్నది. ధర్మబుద్ధి పోయినదని వగచిలాభమేమి? అది కాలవశము – ప్రభువశము. అదటులుండనిండు.

ఒకఁడు వడ్లు పండించుకొన్నాఁ డనుకొండు. వీఁడు చప్పిడికూడే తిని జీవించునా? దానిలోనికి నుప్పు, మిరపకాయ, చింతపండు లోనైన పదార్థములు వలదా? అవి వానికెట్లు వచ్చును. వానినిమత్తమై వాఁడు పోయిన సేద్యము పాడగును. ఈకారణముచేఁ గొందఱు ప్రయాసపడి నానా గ్రామములు దేశములు తిరిగి కావలసిన వస్తువులన్ని తెచ్చి యొకచోనుంచుకొని వారివారికిఁ గావలసినవి వారివారి కిత్తురు. వీరు వైశ్యులు. వీరు సేయునది లోకసేవకాదా? ధర్మముమాట విడిచిపెట్టుఁడు వీరట్లు చేయరేని కొందఱు చప్పిడియన్నము కొందఱు రాగి సంకటి కొందఱు జొన్నకూడు కొందఱు కందిపప్పు కొందఱు పెసెలపప్పు కొందఱు చింతపండు కొందఱు మిరపకాయలు కొంద ఱుప్పుమాత్రమే తిని జీవింపవలసి యుండును. కావున వైశ్యులు చేయునది లోకసేవయే. పూర్వమువారికంటె వీరి యందుఁ దమస్సుతక్కు వ సత్త్వమెక్కువ.

దేహమును జేతులెట్లు రక్షించుచున్నవో యట్లు ప్రజలకుఁ చోరాది దుష్టజనబాధలేకుండఁ గాపాడు వారు క్షత్రియులు. రైతుల పైర్లు వర్తకులసరకులు దొంగలపాలు కాకుండ రక్షించువారెవరు? వారు కాపాడు కొనఁగలరా? మనల నెవ్వరైనఁ గొట్టవచ్చిన దేహమున కపాయము రాకుండఁ గాపాడునవి యేవి కాళ్ళా? తొడలా తలయా? చేతులేకదా. దేహమున కేదైన బాధగలిగెననుకొండు తగినమందు వేయునదియేది? కాళ్లా? తొడలా? శిరస్సా? చేతులేకదా. అట్లే ప్రజలకేయపాయము రాకుండునట్లు వచ్చినవానిని తొలఁగునట్లు చేయువారు క్షత్రియులు. తక్కిన యిరువురు చేయుకార్యములు వీరు చేయరు. గాయపడిన దేహమునకు నేమందు వేయవలయునో చేతులకుఁ దెలియునా? మానుడు పలాస్త్రి వేయవలసినచోట పొక్కు పలాస్త్రి వేసిన నేమగును? చేతులు నోటిలో నన్నము పెట్టుటచేఁగదా దేహమంతయు బలముగను నారోగ్యముగను నుండఁగలిగెను. ఇప్పుడు మనసొంతచేతులు లేవు. ఇతరులచేతులు పెట్టవలసినదశ పట్టినది. మీఁదివారి కంటె వీరియందు సత్త్వమెక్కు వ.

ఈరోగమున కేమందని చేతులకెట్లు తెలియును. తలచెప్పిననే? అట్టులే రాజుల కాలోచన చెప్పువారు బ్రాహ్మణులు. వీరు తక్కి న మూఁడువర్ణములవారి యోగక్షేమము లాలోచించి వారిక్షేమమునకుఁ గావలసిన వన్ని తెలియఁజెప్పుచుండవలెను. ఇది వీరికిఁ గృత్యము వీరు రైతులవలె ధాన్యముగాని వర్తకులవలె ధనము గాని క్షత్రియులవలె బలముగాని యార్జింపరాదు. దానికై శ్రమింపనురాదు. వీరు సత్త్వగుణ నిష్ఠులై జ్ఞాన మార్జింపవలెను. దానికై యెంతశ్రమమైనఁ బడవలయును. వీరుసంపాదించిన జ్ఞానము ధర్మార్థముగఁ దక్కి నవారికి సుఖముకలుగ వినియోగింపవలెను. ఇది లోకసేవగాదా? తక్కి నవారు చేతులతోఁ గాళ్ళతోఁ గష్టముచేయువారు కావున వానితో లోకసేవ చేయుదురు. వీరు మనస్సుతోఁ గష్టించు వారు కావున **"సర్వేజనా స్సుఖినో భవంతు'** అని మనస్సుతో లోకసేవ సేయవలయును. లోక హితముకొఱకు వ్రాసిన శాస్త్రములు అడవులలోనుండి కాయగసురులు దిని పడియుండు ఋషులు వ్రాసినవికావా? వీరిలో నొక్కొ క్క రు స్వధర్మ నిష్ఠులై లోకసేవసేయువారే. వీరికిని నీస్వధర్మనిష్ఠయే మోక్షమునకుఁ గారణమగునని **"స్వేస్వే కర్మణ్యభిరతః సంసిద్ధిం లభతేనరః"** అని భగవంతుఁడు చెప్పెను.

ఒక దేహమునకుఁ జేతులులేక తల చేయవలసిన పని కాళ్ళు, కాళ్ళుచేయవలసినవి తలచేయుచుండె

నేని కార్యము లెట్లుజరగునో యట్లే యిప్పుడు జరగుచున్నవి.

తలచెడినది దేహమంతయుఁ జెడినది. చేతులులేవు.

ఈ విధముగ నాలుగువర్ణములు పరిణామక్రమమున నేర్పడినవి. కాని యైచ్ఛికములు కావు.

వీరందఱు చేయవలసినది లోకజనసేవమాత్రమేకాదు. దేవతాసేవయుఁ జేయవలయును. వర్షము లుండినఁగదా పైర్లుపండును. వృక్షములు ఫలించును. తాపమాఱును. రోగములు లేకుండును. ఈవర్షము కురియుట మనుష్యులచేతిలో నుండు కార్యము కాదు. దేవతలు చేయు కార్యము. ఆ నిమిత్తమై వారినిఁ బూజింపవలెను. వారో యాహారము నిమిత్తమై మనుష్యసహాయ మపేక్షింతురు. కావున యజ్ఞములచేతను నారాధనవలచేతను ఇతర దేవతాకార్యములచేతను వారిని మనము సంతుష్టులఁ జేసితిమేని వారు వర్షాదులచే మనకు సుఖము కలిగింతురు. ఈవిషయము భగవద్గీతయం దిట్లు చెప్పఁబడెను.

**అన్నా ద్భవంతి భూతాని పర్జన్యా దన్నసంభవః**
**కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షర సముద్భవమ్**
**తస్మా త్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితమ్**
**ఏవం ప్రవర్తితం చక్రం నానువర్త యతీహయః**
**అఘాయు రింద్రియారామో మోఘం పార్థ సజీవతి ॥** **3-15-16-17.**
**యజ్ఞశిష్టా శినస్సంతో ముచ్యంతే సర్వకిల్బిషైః**
**భుంజతేతేత్వఘం పాపం యేపచంత్యాత్మకారణాత్ ॥**

**భ-గీ. 3-3.**

దేవతలు మనకిచ్చినదానిలో వారికిఁ బ్రత్యుపకార బుద్ధిచేనైన నీయక తామే యంతయుఁ దినువారు దొంగలనియుఁ జెప్పఁబడెను.

ఇప్పుడు దేవతారాధనమైనఁ జేయక పశువులవలెఁ దమపొట్టలు నించువా రెందఱుగలరో పాతకులకే యెఱుక. సకాలమున వర్షములు రావలెననిన నెట్లువచ్చును. వానరాలేదని ఘోషపెట్టువారేకాని యేలరాలేదని యేమిచేసిన వచ్చునని విచారించువారులేరు. అది వచ్చుకార్యములు చేయువారును లేరు.

వీరిముచ్చట లటుండనిండు. ఇఁక భగవంతుఁ డేమి సేయుచున్నాఁడో చూతము. లెక్క లేని జీవకోటుల నెల్ల నుద్ధరించుభారము తనపైనుంచుకొని వారిని విడనాడక సర్వకాల సర్వావస్థలఁ గూడనుండి ప్రేరకుఁడై వానికి హితమగు కార్యములు చేయించుచుఁ జేయరానిపనులు చేసినపుడు దండించి బుద్ధివచ్చునట్లు సేయుచుజీవుఁడు నరకమునకుఁ బోయిన నరకమునకు స్వర్గమునకుఁబోయిన స్వర్గమునకుఁ దల్లిగర్భము చొచ్చిన నచ్చటికిఁ బోవుచు నెవ్వనెవ్వని రక్షించుట కెన్ని యుపాయములు చేయవలయునో చేయుచుఁ దన్నుఁదిట్టినను నుపేక్షించినను లేఁడనినను సహించుచు మనకు హితమైన కార్యమునే చేయించుచుండును. ప్రతిఫలము దేనియుఁ గోరఁడు. మనమై కాయో యాకో పండో నీళ్ళో భక్తితో నిచ్చిన గ్రహించును లేనియెడల నూరకుండుచుఁ గంటిని ఱెప్పవలెఁ గాచుచుండును. ఏతలిదండ్రులు తమబిడ్డల నింతకంటె నెక్కువగ రక్షింపఁగలరు. తుదకుఁ దనసేవసేసినవారిని దనసమానుఁ జేయును ఏప్రభువిట్లు సేయును. ఇఁక నేయోగ మిట్టి యవ్యధాన మోక్షఫల మీయఁగలదు. కావున భక్తియేముక్తి. ఇంతకంటె రాఁగలలాభ మెవరి కేమిగలదు.

## ముక్తినిదానము జ్ఞానమా భక్తియా?

ప్రశ్న :- ఓయి ముక్తియనఁగా నవిద్యా నివృత్తియే దానికిఁ గారణము బ్రహ్మజ్ఞానము. **"బ్రహ్మవిద్ బ్రహ్మైవ భవతి"** యని శ్రుతులు చెప్పుచుండ నీవు మోక్షమునకు భక్తికారణ మనెదవే అదియేల?

**ఉత్త :-** అయ్యా! మోక్షమునకు బ్రహ్మజ్ఞానము సాధనమనుట మాకును సమ్మతమే. కాని బ్రహ్మజ్ఞాన మనఁగా నేమి? ఎట్టి జ్ఞాన మవిద్యను నశింపఁజేయును?

ప్ర :- బ్రహ్మమువేఱు తానువేఱు, అని యవిద్యచే (అజ్ఞానము) జీవుఁడు భ్రాంతిచెందియున్నాఁడు. ఈ భ్రాంతి సంసారమునకుఁ గారణము. అహంబ్రహ్మాస్మి నేనే బ్రహ్మము. తత్త్వమసి నీవే బ్రహ్మము. అను మహావాక్యార్థ జ్ఞానముచే నాయజ్ఞానము నశించును. త్రాడును బామని భ్రమించిన వానిభయము వానియాప్తుఁ డొకఁడు ఇది పాముగాదు త్రాడని చెప్పినప్పు డతని యజ్ఞానము నశింపలేదా?

**ఉ :-** త్రాటిని బామనుకొనుటకు ముఖ్యకారణము మునిమునిచీఁకటి. నిండువెలుతురులో ద్రాడు పామని యెవఁడును భ్రమింపఁడు. నిండు చీఁకటిలోను దలంపఁడు. కానవచ్చి కానరాని పలుచని చీఁకటిలోనే

యట్టిసందేహము కలుగును. ఈసందేహమునకు ముఖ్యకారణము మునిచీఁకటి. అది యామిత్రుఁ డేమాట చెప్పక వెలుతురు తెచ్చిచూపినను బోవును. కావున సత్యమైన ముఖ్యకారణము జ్ఞానముగాదు. అదట్టులుండనీ, బ్రహ్మజ్ఞాన మనఁగా మహావాక్యార్థజ్ఞాన మంటివి. అహం బ్రహ్మాస్మి – తత్త్వమసి యను మహావాక్యముల యర్థము నీవెఱిఁగితివికదా? నీకు మోక్షము వచ్చినదా? వచ్చియుండిన నీవిచ్చటఁ గూర్చుండి యీ ముచ్చట లాడవుకదా.

మఱియును మీరు చెప్పెడి దృష్టాంతమే మఱియొకటి నేను జెప్పెదను. కొందఱకుఁ జంద్రు లిరువురు న్నట్లు కానవచ్చునుగదా. వాని మిత్రుఁడొకఁడు ఓరీ! చంద్రుఁ డొకఁడే యిరువురు లేరనిచెప్పును ఇరువురు చంద్రులు కానరాక పోయిరా! ఏల?

భేదదృష్టికిఁ గారణమగు నజ్ఞానము నశించినది గాని దీర్ఘకాలముగ నున్న యవిద్యావాసన పోలేదు. కావున నిరువురు చంద్రులు కానవచ్చుచున్నారు.

ప్ర :– తత్త్వమసీత్యాదులవలన జ్ఞానము కలిగినది. అజ్ఞానము పూర్తిగాఁ బోలేదనుట సరిగాదు. అప్పుడట్టిజ్ఞానమే పర్యాప్తముకాదు కారణముకలిగినది. కార్యము కలుగలేదనుట సరిగాదు. జ్ఞానము కలిగిన పిమ్మటఁగూడ నజ్ఞానము వాసనతోడ నశింపదేని దానిని నశింపఁజేయునది వేఱేదికలదు? మీమతమున వేఱొకయుపాయము లేదుకదా? మంచిది. మీరు జీవుఁ డద్దమువంటివాఁడనియు అజ్ఞానము దానిపైఁ గ్రమ్మిన దుమ్మనియు దుమ్ముతుడిచిన నద్దము ప్రకాశించునట్లు అజ్ఞానము నశించిన నాత్మస్వస్వరూపముతోఁ బ్రకాశించునని చెప్పెదరుకదా? మహావాక్య శ్రవణమను నీటితో జీవుఁడను నద్దముమీఁది దుమ్ము కడిగితిరి. దానికిఁ గాంతి స్వస్వరూపము రాకుండుట కేమిగారణము? ఇదిగాక వేఱొకటి యుండవలయునుగదా. అదియేది? లేదుగదా? అప్పటికి నజ్ఞానమునకు నాశమేలేదు. కస్తూరి యుండిన డబ్బిలోఁ గస్తూరిపోయినను దానివాసన పోనట్లు అజ్ఞానము నశించినను దానివాసన పోలేదంటివిగదా. మామత ప్రకారము కస్తూరి సత్యము దానివాసన సత్యము. మీమత ప్రకారము బ్రహ్మేతరమైన సర్వ మసత్యము. డబ్బియందుఁ గస్తూరి యున్నదని భ్రాంతిచే ననుకొనుటయేగాని వాస్తవముగఁ గస్తూరి యున్నదని భ్రాంతిచే ననుకొనుటయేగాని వాస్తవముగఁ గస్తూరిలేదు. కస్తూరి యసత్యమైనపుడు దానివాసన యెట్లు సత్యమగును. కస్తూరి యసత్య మైనపుడు దాని వాసనయు నసత్యమే. రెండుకూడ నశింపవలసినవేకదా. ఒకటిపోయి యొకటియున్నదనుట బాలభాషణము గాదా.

**ఉ :–** చంద్రుఁడొక్కఁడే యనుజ్ఞానము కలిగినపిమ్మటఁగూడ జంద్రబింబములు రెండు కానవచ్చుట విపరీతము కాదు. ఏలయందురా? అట్టి దృష్టికారణము జ్ఞానముచే నశింపలేదు. అట్టి దృష్టికిఁ గారణము నేత్రరోగము. అదిసత్యము ఆ రోగము పోయిన నా భేదదృష్టిపోవును. నీ యుపదేశమక్కఱలేదు. దానితోఁ బ్రయోజనము లేదు. కావున నజ్ఞాన నివృత్తియే మోక్షమనుట సరిగాదు.

ప్ర :– అయ్యా! అజ్ఞానము నశించినను అది దీర్ఘకాలముగ నుండునది కావున దానివాసన వెంటనే నశింపలేదంటివి. అంగీకరించితిని, ఏమిచేసిన నావాసన నశించును?

**ఉ :–** అసకృదుపదేశాత్తను సూత్రముచే నా మహావాక్యములను బలుమాఱు వినవలె ధ్యానము చేయవలె. అయ్యా! "జ్ఞానాత్ ధ్యానం విశిష్యతే జ్ఞానముకంటె ధ్యానము శ్రేష్ఠమైనది. అని భగద్గీత 12వ యధ్యాయమందుఁగలదుకదా? ఆకారణమున ధ్యానము జ్ఞానము కాదుగదా. శ్రవణం కీర్తనం విష్ణోః, స్మరణం పాదసేవనమ్, అర్చనం వందనం దాస్యం, సఖ్యమాత్మ నివేదనమ్. ఇతి పుంసార్పితా విష్ణౌ భక్తిశ్చే న్నవలక్షణా యని స్మరణము భక్తిగదా అజ్ఞానము సవాసనముగ నశించుటకు భక్తిగారణ మయ్యెనా? జ్ఞానము కారణమయ్యెనా? కావున దీర్ఘకాలముగనుండు నజ్ఞానము నీయద్వైతజ్ఞానముచేతనే నశింపదు. కనుకనే శ్రోతవ్యో – మంతవ్యో – నిధిధ్యాసితవ్య యని శ్రవణముచాలక యుపాసనము నిధిధ్యాసము (ధ్యానము) చెప్పఁబడెను.

కాఁబట్టి వేదాంతములందుఁ జెప్పఁబడిన జ్ఞానము వాక్యార్థజ్ఞానము మాత్రమేకాదు. ధ్యానముతోఁ గూడిన జ్ఞానమనియు నందు నవ్యవధానకారణము ధ్యానమనియు గ్రహింపవలెను. అదియేభక్తి. ఎట్లన? **"విజ్ఞాయ ప్రజ్ఞాంకుర్వీత'** (బృహ. 6. అ. 4. బ్రా. 21 వా). తెలిసికొని ధ్యానము చేయవలసినదని యర్థము.

**'అను విద్య విజానాతి'** (ఛాం. ప్ర. 8-12. ఖ. 6. వా.) తెలిసికొనినపిమ్మట ధ్యానము చేయుచున్నాఁడు.

**ఓమి త్యేవాత్మానం ధ్యాయథ"** ఓమ్మనయే పరమాత్మను ధ్యానింపుము. (ముం. 2. ము. 2 ఖ. 6. వా.)

**నిగచాయ్యతం మృత్యుముఖా త్ప్రముచ్యతే'** (కఠ 13వ అ. 15. వా). పరబ్రహ్మమును బాగుగ ధ్యానించి మృత్యుముఖమునుండి విడువఁబడును.

**ఆత్మానమేవ లోకముపాసీత'** (బృ. 3 అ. 4 బ్రా. 15వ వా). అనఁగాఁ బరమాత్మనే ప్రాప్యునిగ నుపాసింపవలయును.

**ఆత్మావా అరేద్రష్టవ్య శ్శ్రోతవ్యో మంతవ్యోయ నిధిధ్యాసితవ్యః** (బ. 6-5. బ్రా. 6 వా). అనఁగాఁ బరమాత్మయే చూడఁదగినవాఁడు వినఁదగినవాఁడు విచారింపఁ దగిన వాఁడు. ధ్యానింపఁ దగినవాఁడు.

**సోన్వేష్టవ్య స్సవిజిజ్ఞాసితవ్యః"** (ఛా. 8. ప్ర. 7. 1 వా) అనఁగా బరమాత్మయే వెదుకఁదగినవాఁడు విచారింపఁదగినవాఁడు.

ఈవిధముగ నుపనిషత్తులు మోక్షసాధన ముపాసనముగఁ జెప్పెను. సేవాభక్తిరుపాస్తి యని యుపాసన మనఁగా భక్తి యని ముందే వివరింపఁబడెను.

**(సశేషము).**

## వాసుదాస విన్నపములు.

### (గతసంచికాశేషము 87వ పుట చూడు.)

**11.** ఓరీ! యీవగలమారిమాటలు చాలింపుము అతివినయము ధూర్తలక్షణము. చంకదుడ్డు శరణార్థి. ఇంతమాత్రముతోనే నేను నిన్ను నమ్మఁజాల. ఈకొంచెమునకే నేను బేలుపోయి నిన్ను నావారిలోఁ జేర్చికొంటి నేని. ఱేపు నీవు వారిపై నాపైఁ దిరుగఁబడిన నేనేమిచేయఁగలను. ఒకసారి దగ్గఱఁజేర్చి యావల మరల నెట్లువిడుతును? ముష్టిచెట్టునైనను బెట్టినవాఁడు కొట్టరాదు. కావున నాకు విశేష చిహ్నములు గనఁబఱుపుము. నమ్మెదను. అగ్ని సాక్షికముగఁ గట్టుకొన్న భార్యను గొన్నిదినములు నాయొద్ద లేనికారణమున నామె మనస్సు చలించిన దేమోయని యగ్ని పరీక్షచేసికదా గ్రహించితిని. ఇఁక నీవనఁగా నెంతమాత్రము. నాయొద్దఁ జేరిన వాఁడు మరలఁ జెడరాదు. అట్టివాఁడని పరీక్షించి చేర్చుకొందును. నావాఁడనఁగానే వాఁడు శిష్టుఁడని లోకము విశ్వసించునట్లుండవలెను. అందువా? నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

**12.** స్వామీ! యట్లైన నన్నేమి చేయుమనెదవు. సర్వము నీవే. కావున నెవరి కుపకారము చేసినను నీకుఁ జేసినట్లగునని యందఱకు నుపకారమే చేయుచున్నాను. అపకారము చేయుటలేదు. ఎవరికే బాధ కలిగించినను నీకుఁ గలిగించినట్లగునని నేనేజీవజంతువును దెలిసి హింసింపను. జగద్రక్షకుఁడవు నీవే. నీవుతప్ప వేఱొకరుఁడు లేఁడని నా రక్షాభారము నీయందు వైచితిని. నాకు ధారకపోషకములు నీచరణములే యను నమ్మికతోఁ జంటిబిడ్డ తల్లిచన్నులవలె నీపాదములే గట్టిగఁ బట్టి తక్కి న సర్వము త్యజించితిని. నీచరణములు తక్కు c దక్కి న యుపాయమేదియుఁ గోరువాఁడఁగాను. నాకుఁ గల సర్వస్వము నీవిచ్చిన దంతయు నాదియను నభిమానము గలదంతయు నీసేవకే యర్పించితిని. ఇట్లు సర్వము నాదియను నది యేదియు లేకపోవుటచే నకించనుఁడ నైతిని. నాకంటె దీనుఁడు లోకమునఁ గానరాఁడయ్యె. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా నమోనమః.

**13.** ఓరీ! యింతతో నేను సంతుష్టిపడను. ఇవన్నియు దేహము నాశ్రయించి యుండునవి. దేహము ప్రకృతిపరిణామము సర్వదామాఱుచుండును. అట్టి దేహము నీవేమి చేసితి వందువా? స్వామీ! నీవు సీతకు నీపేరుగల ముద్దుటుంగరముగదా పంపితివి. అది చూపించుటచేఁగదా సీతాదేవి యది నీయుంగరమని యది ధరించి తెచ్చినవాఁడు నీ దాసుఁడని నమ్మెను. అది ధరించిన కారణమునఁగదా హనుమంతుఁడు సముద్రము దాఁటఁగలిగెను. లోకమున నేవస్తువెవరిదో తెలియుటకు వానిపేరుగాని చిహ్నముగాని యా వస్తువుపై ముద్రింతురుకదా. ఈదేహము నీదియనుటకు యావస్తువుపై ముద్రింతురుకదా. ఈదేహము నీదియనుటకు నీ చిహ్నములు ధరించితినిగదా. ఊరక ధరించినఁ దుడిచినఁ బోవునని శాశ్వతముగ నుండునట్లు నీతప్తముద్రల ధరించితిని. సీతాదేవి నగ్నిప్రయాణము చేయించితినంటివి. ఈతప్తముద్రాసొత్తని తోఁచుటలేదా? చూచినవారీదేహము నీదియని గుర్తించుచున్నారుకదా. నీదాసుఁడను నీవాఁడనుటకు వేఱే దైన శాశ్వత చిహ్నముండినఁ జెప్పుము. అట్టులే ధరించెదను. ఎప్పుడు నాదేహమును ముద్రవేసి నీకు

విడిచితినో యదిదానికి సంబంధించిన సర్వము నీదేకదా. కావున నిప్పుడైన నన్ననుగ్రహింపుము. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్రప్రభో నమోనమః.

**14.** ఓరీ! యిప్పుడు నిన్ను రక్షించితిని. భయపడకుము. సర్వభూతాభయమిచ్చితిని. నీవు చెప్పిన ప్రకారము వర్తించుచుండుము. నిన్ను నా యైకాంతిక నిత్యకింకరులందుఁ జేర్చుకొంటిని నీవింత పరితాప పడుటకుఁ గారణమేమి? నీకు నాకుఁగల సంబంధమెట్టిది? నాదాస్యముపై నీకింత పట్టుదలయెట్లుకలిగెను. చెప్పుము అనెదవా? చెప్పెదవినుము. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్రప్రభో నమోనమః.

**15.** స్వామీ! సర్వాతిశాయీ! ! లోక మంతయు నెంతపరీక్షించి చూచినను, గొప్పకొలఁది యని రెండు కానవచ్చుచున్నది. కేవల సమములు రెండులేవు. అంకగణితమునందుఁ బది యనునది తొమ్మిదికంటె గొప్పది. పదునొకండు కంటెఁ దక్కు వది. పదికిసమానమైనది పదియ. కాని వేఱొకటిలేదు. అట్టులే యేపదార్థము చూచినను ఒకదానికంటె గొప్పదగునది మఱియొక దానికంటెఁ జిన్నదగుచున్నది. ప్రపంచమం తయు సోపానక్రమము ననుసరించి యున్నది. అన్నివిధముల నావంటివాఁడను నేనేకాని వేఱొకఁడులేఁడు. లోకమున సమత్వమనునదిలేదు. ఈసోపానములలోఁ గడపటి మెట్టు నీవు. నీకు సమానమైనదికాని నీకంటె మీఁదనుండునది కాని లేదు అని యంగీకరింపక తప్పదు. అంగీకరింపకుండిన ననవస్థాదోషము తప్పదు. కావుననే నిన్ను శ్రుతులు **'ఏకమేవ-అద్వితీయ'** మని చెప్పుచున్నవి. అన్నిటికంటె గొప్పవాఁడవు కనుకనే నిన్ను బ్రహ్మము పరబ్రహ్మమని శ్రుతులు చెప్పుచున్నవి. ఎప్పుడు నీవుపరబ్రహ్మమై యన్నిటికంటె గొప్పవాఁడ వైతివో యపుడే తక్కి నవన్నియు నీకంటెఁ దక్కు వవనియే చెప్పవలసియున్నది. తక్కు వది యొక్కు వదాని నాశ్రయింపకుండిన నిలువలేదు. నిరాశ్రయుఁడవు నీ వొక్క ఁడవే కాని మఱియేదియుఁగాదు. కావున నన్నియు నిన్నాశ్రయింపక వేఱుగతిలేదు.

ధనార్థుల వేయిగలవానిని – లక్షగలవానిని – కోటీశ్వరుని – అర్బుదేశ్వరుని నిత్యాదుల ధనికుల నాశ్రయింతురు. ఎప్పుడు శతమని – సహస్రమని – లక్షయని – కోటియని సంఖ్య చెప్పితిమో యది యప్పుడే అంతముతోఁ గూడినదని యేర్పడుచున్నది. కొన్ని దినములకుఁ గాకున్నఁ గొన్నిదినములకైన వారిధనము వ్యయపడి వారు మరల దరిద్రులు కావలసిన వారే. అట్టివారి నాశ్రయించినవా రాగతికే వత్తురు. కావున మరల దరిద్రుఁడను గాఁగూడదనుకొనువాఁడు అనంతధనము గలవాని నాశ్రయింపవలెను. జ్ఞానబలశక్తులందు నైశ్వర్యాదులందు ననంతుఁడవు నీవొక్క ఁడవే కాని వేఱొక్క రుఁడు లేఁడు. కావున నివి శాశ్వతముగాఁ గోరువాఁడు బుద్ధిగలవాఁ డైనచో నిన్నే యాశ్రయింపవలెను. తక్కి నవారి నాశ్రయించిన వాఁడు తప్పక యేకాలమందో యొక కాలమునఁ బతనముగాంచును. నీయాశ్రయమే కర్తవ్యమయినచో బ్రహ్మనై నిన్నాశ్రయించిన నేమి? నావంటి యకించనుఁడనై నిన్నాశ్రయించిననేమి? ఒక్క పండు కోయుటకు దోఁటి కావలసి యుండినయెడల నేలనుండి దోఁటివేయువాఁడు బుద్ధిమంతుఁడా? ప్రయాసపడి సగము చెట్టెక్కి దోఁటివేయువాఁడు బుద్ధిమంతుఁడా? శ్రీఘ్రఫలప్రాప్తి యెవరికి? కావున బ్రహ్మత్వాదులతో నాకుఁ బనిలేదు. వారితోను నాకుఁబనిలేదు. ఈ విధముగ నాకు నీ వెక్కు వ నేను నీకుఁదక్కు వ యనునది స్వభావసిద్ధముగ నేర్పడుచున్నది నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా శ్రీరామచంద్ర ప్రభో నమోనమః.

**16.** జగజ్జనకా! అశ్రితవత్సలా!! ఓరీ! న **'న్నుత్తమోత్తముఁడ'** నంటివి – నీ వధమాధముఁడ నంటివి. ఇంత తారతమ్యము మనయందుండఁగా మనకెట్లురా పొంతనములు కుదురును. నీవెవ్వఁడవో నేనెవ్వఁడనో పోపో నిన్ను రక్షించు భారము నాయందులేదు. అని నీవనరాదు. ఏల యందువా? నేను నీకుఁ బరాయివాఁడనుగాను. స్వభావమున నేను నీవాఁడనే, ఇన్ని జన్మములుగ నిది నేను దెలిసికొనినవాఁడను గాను. ఆచార్య స్వరూపమున నీవే వచ్చి చెప్పఁగాఁ దెలిసికొంటిని. ఇఁక నీవు నన్ను మోసపుచ్చలేవు. ఇదివఱకుఁ బ్రకృతియను వేశ్యవలలోఁబడి మిన్ను మన్ను నిన్ను నన్ను నెఱుఁగలేక యర్బుదములకొలఁది జన్మముల వ్యర్థముచేసికొంటిని. ఇన్ని జన్మములుగ నీవు రానివాఁడవు – ఇప్పుడేలవచ్చితివని త్రోయకుము. ఇప్పుడైన మనవాఁడు బుద్ధిమంతుఁడై దుష్టసాంగత్యమువదలి మనయొద్దకు వచ్చినాఁడుకదాయని సంతోషింపుము. ఇన్నాళ్ళు నన్నుఁ జక్క ఁజేయని భారము నీదికాని నాదికాదు. నీకు నాకుఁగల సంబంధములు చెప్పెదవినుము. నమోనమ ఏక శిలావాసా పాలితవాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

**17. భక్తజనకల్పకా !**

**పితాచ రక్షక శ్శేషీ, భర్తాజ్ఞేయో రమాపతిః**
**స్వామ్యాధారో మమాత్మాచ భోక్తాచాద్య మనూదితః.**

శ్రీమన్నారాయణుఁడవైన నీవు చేతనుఁడనై జీవాత్మనైన నాకు తండ్రి, రక్షకుఁడు, శేషి, భర్త, జ్ఞేయుఁడు, స్వామి, ఆధారము, శరీరి, భోక్త యని చెప్పఁబడియుండుటచే నీకు నాకీ తొమ్మిదివిధముల సంబంధముగలదు.

| **నీవు పరమాత్మవు.** | **నేను జీవాత్మను.** |
|---|---|
| 1. జనకుఁడవు – | పుత్రుఁడను. |
| 2. రక్షకుఁడవు – | రక్ష్యుఁడను. |
| 3. శేషివి – | శేషుఁడను. |
| 4. భర్తవు – | భార్యను. |
| 5. జ్ఞేయుఁడు (తెలిసికోఁదగినది) – | జ్ఞాతను (తెలిసికొనువాఁడను). |
| 6. స్వామివి – | సొమ్మును. |
| 7. ఆధారము – | ఆధేయము. |
| 8. ఆత్మ (శరీరి)వు – | శరీరము. |
| 9. భోక్త – | భోగ్యుఁడను. |

నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

18. జగన్నాయకా! 'యోరీ! నీవు పుస్తకపాఠము చిలుక పలుకులవలెఁ జెప్పుచున్నావుగాని యది సత్యమా యసత్యమా నీవు విచారించి దృఢపఱుచుకొంటివా? యందువేమో చెప్పెదవినుము.

**'యోనః పితా జనితా యోవిధాతాః'** అని ఋగ్వేతము 10 8 2–3 చెప్పుచున్నది.

ఎవఁడు మనకుఁ దండ్రియై, ఉత్పాదకుఁడై, నియామకుఁడై యున్నాఁడో – ఇది శ్రుతిప్రమాణము. **పితాహమస్యజగతో మాతా ధాతా పితామహః. గీతా. 9–17.** ఈచిదచిదాత్మకమగు ప్రపంచమునకు నేనే తండ్రి, నేనేతల్లి, నేనే పోషకుఁడు, నేనే పితామహుఁడని నీవే యర్జునునకుఁ జెప్పితివి.

**సర్వయోనిషు కౌంతేయ, మూర్తయః సంభవంతియాః**
**తాసాం బ్రహ్మ మహద్యోని, రహం బీజప్రదః పితా. గీతా. 14–4.**

ఎనుబదినాలుగు లక్షల యోనులందు నేయాకారములు కలుగునో వానికంతయుఁ బ్రకృతియే తల్లివంటిది. వానివాని కర్మాయత్తమగు నుత్పత్తికి నేనే బీజరూపమైన తండ్రిని, అని నీవే చెప్పితివి. నీమాట నమ్ముదునా వలదా? నమోనమ ఏక శిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

19. జగద్రక్షకా! తండ్రీ!! 'ఓరీ నేను వెయ్యిచెప్పెదను నీవెట్లునమ్మితివి? నీకు బుద్ధియిచ్చిన దేల? ఆలోచించుటకు గాదా? యందువేమో? స్వామీ! రామచంద్రా! బుద్ధిబలము ప్రమాణముకాదు. నాబుద్ధిబలముచే నేనొకటి యూహించిన నాకంటె బుద్ధిమంతుఁ డది సరిగాదని యుక్తులచే దానిని ఖండించి నేను జెప్పిన దానికి విరోధముగ సిద్ధాంతము చేయును. వానికంటె బుద్ధిమంతుఁడు మఱియొక విధముగాఁ జేయును. కావున బుద్ధిప్రమాణముకాదు నీవాక్యమే నాకుఁ బ్రమాణము. నీవాక్యమునకు ననుకూలముగా నాలోచించిన బుద్ధి ప్రమాణమే. కాకుండినఁగాదు. ఏలన మనస్సు బుద్ధి యివి ప్రకృతికి సంబంధించినవి. ప్రకృతి సర్వదా వికారము పొందుచుండునది. ఈనాఁటి నాబుద్ధి ఱేపటికి మాఱును. అప్పుడు నామాటయే నాకుఁ బ్రమాణము కాకపోవును. అలలమీఁది పడిన కదలక యెట్లుండఁగలదు. అయినను నీవిచ్చిన బుద్ధిని నేను వ్యర్థముచేయలేదు. నేనాలోచించి నీవుచెప్పినది సత్యమేయని తీర్మానించుకొంటిని. ఎట్లనెదవా? వినుము.

నేను సత్యము, నిత్యము, నేనే దశయందుండిన సంప్రజ్ఞాత సమాధియందుండినను అసంప్రజ్ఞాత సమాధియం దుండినను నేను లేను అను భావము కలుగనే కలుగదు. తక్కి న వన్నియు లేనట్టు భావింపవచ్చును గాని నేను లేనని భావింప సాధ్యపడదు. కావున నేను సత్యము నిత్యము. అసంప్రజ్ఞాత సమాధియందు నన్ను నేను మఱతును. సర్వము మఱతును. ఆ కారణమున నేను నాశమైతి నని సర్వము నాశమయ్యెనని చెప్పరాదు. కన్నులు మూసికొనినఁ బదార్థములు గానరావు. ఆమాత్రమున నవి నశించినవగునా? అవి నశించిన మరలఁ గానరాక యుండవలెఁగదా. ఇట్టులే ప్రతిజీవియుఁ దానుండుట సత్యమని తాను నిత్యమని గ్రహింపవచ్చును. కావుననే జీవులు వేఱువేఱనియు నెఱుఁగనగు. ఇట్లు దేహముతోఁ గూడిన నాకుఁ గారణము నాతండ్రి. కావున నేను గార్యమైతిని నాతండ్రి కారణమయ్యెను. అట్టులే నాతండ్రి కార్యము నా

తాత కారణము. అట్టులే ప్రతిపదార్థము లోకమునఁ గారణము కారణము రెండు నగుచున్నవి. ఈవిధముగ నా వంశపరంపర నాలోచించితి నేని కోటికల్పము లిట్లే యాలోచించినను దుదకుఁ గారణములేని కారణము, కారణము కార్యము రెండు నొకటియేయైనది యొకటి యుండవలయునని యంగీకరింపక తప్పదు. అంగీ కరింపకుండిన ననవస్థాదోషము సంభవించును. కావున నావంశమునకు మూలపురుషుఁడొకఁడు తండ్రిలేని తండ్రి, కారణములేని కారణము సర్వకారణమైనవాఁడొకఁడున్నాఁడని గ్రహింపక తప్పదు. వాఁడే నీవు. ఇట్టులే ప్రతిజీవియు నాలోచించెనేని యన్నిటికి మూలకారణము నీవొక్క ఁడవే యగుచున్నావు. నా తండ్రియే యందఱకుఁ దండ్రి – వేఱువేఱు కారణము లుండిన బహునాయకమైన రాజ్యమువలెఁ బ్రపంచ మేకవిధముగ నిప్పటివలెఁ బ్రవర్తింపఁజాలదు. భిన్నభిన్నములుగఁ బరస్పర విరుద్ధములుగ నుండియుండును. కావునఁ బ్రభువొక్క ఁడనియే సిద్ధాంతము చేయవలసి యున్నది. ఆయొక్క ఁడే నీవు నీవు తప్ప వేఱులేదు. కారణమేలేక కార్యము గలిగెనని యభావమునుండి ప్రపంచము గలిగెనని చెప్పరాదా యందువేని అభావము నుండి సద్భావము కలుగనే కలుగదు. అసత్తునుండి సత్తేనాఁటికిని గలుగదు. సత్తునుండి యసత్తును గలుగదు. సత్తునకు నాశమేనాఁటికినిలేదు. అది నిత్యము శాశ్వతము సత్యము.

ఏలన దేనికి జననములేదో దానికి నాశములేదు. నీకు జననములేదు. కావున మరణములేదు. ఆదిలేదు. కావున నంతములేదు. కావున నీవుసత్యము, నిత్యము, శాశ్వతము, జనకపదార్థములేక జన్యము కలుగదు. తల్లిదండ్రులు లేక బిడ్డలులేరు. నీవొకఁ డుండఁబట్టియుఁ బ్రపంచమునకు నీవు కారణమగుటఁ బట్టియు నీవు జనకుఁడు నేను జన్యుఁడని చెప్పితిని. ప్రపంచమంతయు నిట్టిదే. ఇట్లు నీవు నాకుఁదండ్రివి తాతవని నిర్ధారించుకొంటిని. ఇట్టులే సర్వమునకు నీవే తండ్రివి, తాతవు, చెట్టులోని యాకులకుఁ బండ్లకుఁ బూలకుఁ గొమ్మలకు రెమ్మల కన్నిటికి మూలమొకటియేకదా. కావున నాకులు లోనైన వన్నియు సమానోదరము లేకదా. కావున సమస్తప్రాణులు నాకు సోదరులే. విత్తన మొక్క టియే వేరొక్క టియే యైనను దానివలనఁ గలిగిన ఆకులు, కాయలు, పూవులు, పండ్లు ఆకారమునందు గుణమునందుఁ బరస్పరము భేదించినట్లు, నలుగురు కొడుకులకుఁ దండ్రి యొక్క ఁడేయైనను వారిలో వారికి గుణకర్మములచే భేదమున్నట్లు మాలో మాకు భేదములు గలవుగాని నీకుమాకు నీసంబంధము తొలఁగదు. దీనినేకదా ఎవ్వనిచే జనించుజగము, యతోవా ఇమాని భూతాని జాయంతే, జన్మాద్యస్య యతః' అని శాస్త్రములు చెప్పుచున్నవి. నమోనమ ఏక శిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

**20.** జగత్కా రణభూతా! తండ్రీ సత్యమైన నీవొక్క ఁడ విటు సర్వకారణభూతుఁడవు. నిత్యుఁడవు, శాశ్వతుఁడ వున్నాఁడవని నిశ్చయించుకొని తరువాత సర్వమునకు మూలకారణము సర్వదా నీవే యగుట చేతను నీకంటె వేఱొక పదార్థము సత్యమైనది లేకుండుటచేతను నీకు నాశమనునది లేకుండుటచేతను నీయందు వేఱువికారములు గలిగింపఁగలది వేఱొకటి లేకుండుటచేతను నీకు దేశమనునది కాలమనునది లేకుండుటచే నీ వనంతుఁడవని నిశ్చయించుకొంటివి రాత్రియని పగలని నెలలని అయనములని సంవత్సరము లని యుగములని కల్పములని కాలభేదము మాకేకాని సూర్యునకు లేనటు నీకు కాలమనునదిలేదు. ఈ కాలభేదముచేతనే మాకు వర్తమాన భూత భవిష్యత్తు లేర్పడుచున్నవి. రాత్రి పగలు లేనిచోట నిన్న నేఁడు ఱేపనునవి యెందుండివచ్చును. కావుననే నీవు త్రిసత్యుఁడవని శాస్త్రములు చెప్పుచున్నవి. అటులేనీకు దేశ పరిచ్ఛేదములేదు. భూమియం దొకచోట నిండ్లు కట్టుకొని యుండువారికి నిది నాయిల్లు యిది నాయూరను భేదము దోఁచునుగాని సర్వత్ర వ్యాపించిన గాలికి నేదియూరు? ఏదియిల్లు అటులేనీకును. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

**21.** నిర్వికారమూర్తి! రామచంద్రా! యిటు నీవు దేశకాల పరిచ్ఛేద రహితుఁడనని నిశ్చయించుకొంటిని గాని చెఱుకును బదితునుకలు చేసినటు లొక్క ఁడవైన నీవే పెక్కు భాగములుగా నుండరాదాయని యాలోచించి తిని. చెఱుకును నఱకుటకుఁ గత్తియొక్క టి కావలెను. తునుకకు తునుకకు నడుమ నెడముండవలయును. రెంటికి నడుమ నాకాశమనునది యుండును. అటుచూచిన నీవుతప్ప వేఱుపదార్థము లేనపుడు నిన్ను భాగించువాఁడెవఁడు. అట్టి భాగములకు నడుమ నేమున్నది. విభాగించు సాధనమేది? యని యాలోచింపఁగా ఆకాశమును, గాలిని తునుకలుగా నఱకుట యెట్టిదో నిన్ను విభజించుట యట్టిదిగానే తోఁచెను వానినైన నుపాధులచే భేదింపవచ్చునేమో కాని నిన్ను భేదింప సాధ్యముకాదు. ఉపాధులందుఁగూడ నాకాశము వాయువు గలదుగదా వానినే భేదింపరానపుడు నిన్నుభేధింప నెటు సాధ్యపడును. కావున నీవు సర్వదా అఖండుఁడవని పూర్ణుఁడవని నిశ్చయించుకొంటిని. మఱియు నీయందు వికారము గలిగింప వేఱొకవస్తువు

గాని కారణముగాని లేదు. నీవు నిత్యుఁడవు శాశ్వతుఁడవు కావున నీవు కోరినను నీయందు నీవు వికారములు గలిగించుకొనఁజాలవు. నీవు మాఱందలంచితివేని మఱియేపదార్థముగ మాఱవలయును. మఱియొకపదార్థ మేలేదే. కావున నీస్వరూప స్వభావము లెన్నఁటికి మాఱవు గావున నిర్వికారుఁడ వనుకొంటిని. ఒక వేళ నిన్ను నీవు విభజించుకొనఁ గలిగినగో సత్యములు పెక్కు లగుటచే నీ సత్యత్వ నిత్యత్వ శాశ్వతత్వములకు హానివచ్చును. మాయట్టివాఁడవే నీవు నగుదువు. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

22. చైతన్యశరీరా! యిటు లాలోచించి పిదప నిట్టి నీవు చేతనమా యచేతనమా యని యాలోచించితిని మనుష్యులందుఁ, బశువులందు, మృగములందుఁ, బక్షులందేకాకలతా గుల్మ వృక్ష పాషాణాదులందును జైతన్యము గలదనియు మనుష్యులకెటు సుఖదుఃఖజ్ఞానము కలదో యటులే వానికిఁ గలదని యిప్పుడు ప్రత్యక్ష నిదర్శనములచే విజ్ఞులంద అంగీకరించి యున్నారు. బుద్ధిలేనియెడల సుఖదుఃఖానుభవ జ్ఞానమెందుండి వచ్చును? ఇట్లు సర్వభూతములందుండు చైతన్య మెందుండివచ్చెను. నీవుతప్ప వేఱొక్క టిలేదాయెఁగదా. కావున సమస్త ప్రాణులయందలి చైతన్యము నీచైతన్యమందలి యంశమేయై యుండవలెను. నీయందు లేనిది వానియందురావు. కావున నీవు చేతనుఁడవే జ్ఞానస్వరూపుఁడవే కాని యచేతనుఁడవు కావని నిశ్చయిం చుకొంటిని. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

23. ఆనందస్వరూపా! ఇట్లు నీవు జ్ఞానస్వరూపుఁడవని నిశ్చయించుకొని తరువాత నిట్టు లాలోచించి తిని. జ్ఞానమువలననే యిది సుఖము ఇదిదుఃఖమని తెలియుట. జ్ఞానములేని శవమునకు సుఖదుఃఖములు లేవు. నీవు జ్ఞానస్వరూపుఁడవు కావున నీకును సుఖదుఃఖములుగలవా? ఉండెనేని సుఖదుఃఖములు కలిగించు నవియేవి? యని యాలోచించితి. తనకంటె భిన్నపదార్థములవలన సుఖము దుఃఖము వచ్చునని పామరులు తలఁతురుగాని జ్ఞానులు తలపరు. తమసుఖదుఃఖములకుఁ దామే కారణభూతులనియే జ్ఞానులు తలఁతురు. నీ కంటె వేఱుపదార్థము లేని కారణముచేత నీకు సుఖము గలిగించునది కాని దుఃఖము కలిగించునదికాని వేఱొకటిలేదు. నీ సుఖదుఃఖములకు నీవే కారణభూతుఁడవు కావలయును. సుఖదుఃఖములకుఁ గోరికలు కారణములు. తానుగోరిన దనుకూలించివచ్చిన సుఖమనియు, బ్రతికూలించివచ్చిన దుఃఖమనియు మందులు తలఁతురు. జ్ఞానుల కట్టికోరికలులేవు కావున వారికి సుఖదుఃఖములులేవు. వారికే యిటులుండ అవాప్త సమస్తకాముఁడవు కోరఁదగినది నీకులేనిది లేకుండుటచే నీకుఁ గోరికలులేవు. కావున నీకు సుఖదుఃఖములు లేవు నీవెట్లు జ్ఞానస్వరూపుఁడవో యట్టులే యానందస్వరూపుఁడవని చెప్పవలసియున్నది. ఏలన నేదశయం దున్న యేప్రాణియందైనను ననివార్యముగ నిరపవాదముగ నానంద మనుభవింపవలయునను కోరిక సర్వత్ర సర్వప్రాణులయందుఁ గానవచ్చుచున్నది. ప్రతి జీవియుఁ జేయు నేకార్యమునకుఁగాని ధర్మమైనదో యధర్మమైనదో యేదియైనను ఆనందానుభవము పరమోద్దేశమై కానవచ్చుచున్నది. జారత్వ చోరత్వాది సమస్తపాప కార్యములకు సమస్తపుణ్యకార్యములకు నానందమే పరమోద్దేశమై యున్నది. లోకమంతయు నేకముఖముగఁ గృషిచేయు నీయానందమెచ్చటిది. నిన్ను విడిచిన వేఱొండు లేనపుడు నీనుండితప్ప మఱియెం దుండి యీయానందము రాఁగలదు. జ్ఞాన మెట్లు నీనుండివచ్చెనో యానంద మట్టులేవచ్చెను. జ్ఞానములేక యానందములేదు. కావున నానందమునకు జ్ఞానము కారణము సహకారియునై యున్నది. లోకులు జ్ఞానాభి వృద్ధిని గోరుట యానందాభివృద్ధికొఱకే. ఆనందము కలిగింపనిజ్ఞానము వ్యర్థము. అది యుండిననొకటే లేకుండిననొకటే. ఈనని పాలీయని యావుండిననేమి లేకుండిననేమి? కావున శుష్క జ్ఞానము వ్యర్థము. ఈవిధముగ నీవు త్రికాలములందు సర్వావస్థలయం దుండువాఁడనగుట చేతను జ్ఞానస్వరూపుఁడ వగుట చేతను ఆనందస్వరూపుఁడ వగుటచేతను నీవు సచ్చిదానంద స్వరూపుఁడవని నిశ్చయించుకొంటిని నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

24. రసస్వరూపా! రామచంద్ర ప్రభో!! వినుము. నీవు నిత్యుఁడవు త్రిసత్యుఁడవు శాశ్వతుఁ డెప్పుడైతివో యప్పుడే నీజ్ఞానానందములు, నిత్యములు, సత్యములు, శాశ్వతములునై యున్నవి. అవి నీస్వరూపములే యగుట నవిలేవనుట నీవు లేవనుటే. ఆనందానుభవమునకు జ్ఞానము కారణమని సహకారి యని ముందు మనవిచేసితిని. ఇది మాయందు యథార్థమగునేని నీయందు యథార్థమే. అట్లైనచో మనుష్య లానందాను భవమునకై తమ జ్ఞానముకొలఁది యేదియో యొకకార్యము చేసి యానందించుచున్నారు. కొందఱు పుష్ప మాల్యాంబరములు ధరించి చందనాదులు పూసికొని యానందించెదరు. కొంద ఱాభరణములు ధరించి యానందించెదరు. తమ్ముఁ జూచి యితరుల మెచ్చుకొనినఁ గొంద ఱానందింతురు. కొందఱు ధనమార్జించి

పెట్టెలలోనుంచి రాత్రులందు రహస్యముగాఁ జూచి యానందించెదరు. కొందఱు స్త్రీలతో సంభోగించి యానందించెదరు, ముదుసళ్ళు వయస్సు భార్యలఁజూచి గ్రుక్కి ళ్ళు మ్రింగుచు నానందించెదరు. చెన్నపురి బృహద్భీజవంతులు వేశ్యలఁ దమతోడఁ బండ్లపైఁ గూర్చుండఁబెట్టుకొని వీధుల వెంటఁదిరిగి సంతోషింతురు. కొందఱు సాహిత్యవిద్యావంతులు మంచి శ్లోకములను స్మృతికిఁ దెచ్చుకొని రసము ననుభవింతురు. కొందఱు కడుపారఁదిని యానందింతురు. ఇట్లు మా యానందానుభవమునకుఁ బెక్కు కారణములు గలవు. నీకిట్టిదేదియు లేదే నీవెట్టు లానంద మనుభవించెదవని యాలోచించితిని. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

**25.** భగవాన్ ! ఉయ్యాల లోనిశిశు వున్నట్టు లుండితనంతటఁదాను నవ్వుచు నానందించును. అతఁ డాడుకొనుటకు నానందకారణమైన పదార్థమేదియు దాపున నుండదు. తనలోఁదానే యేదియో స్మరించుకొని నవ్వును. అటులే నీలోనీవే యానందింతు వేని యీ ప్రపంచస్థితికిఁ గారణము లేదు. ప్రపంచ మొకటి యున్నది కావున దానికి నీవే కారణమైయుండవలెను. నీవుతప్ప దీనిని జేయువాఁడు వేఱొకరుఁడు లేఁడు గదా. కావున నీప్రపంచమును సృష్టించుటకు రక్షించుటకు సంహరించుటకు నీయం దొకశక్తియుండవలెను. విత్తనమునందుఁ జెట్టుగాఁగలశక్తి (Potentiality) లేదేని యావిత్తనము చెట్టుగాఁజాలదు. వేయించిన విత్తనము చెట్టుకాఁ గలదా? మంటియందుఁ గుండగా నగుశక్తి లేదేని యది కుండ కాఁజాలదు. కావున నీయందు సృష్టిస్థితి సంహారకారణమైన శక్తిగలదని యంగీకరింపకతప్పదు. జ్ఞానానందములు లేకున్న నీకు స్వరూప మెటులులేదో శక్తియనునది లేకున్న నీవు శవము వంటివాఁడవనియే చెప్పవలసివచ్చును. నీయందు శక్తియనునది లేకుండిన నీవెట్లు త్రికాలముల నుండఁగలిగితివి. ఉండుటకును శక్తికావలయునుగదా. ఈవిధముగ నాలోచించి నీవు శక్తిమంతుఁడవని తీర్మానించుకొంటిని. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

**26.** సర్వదేవతా చక్రవర్తీ! అష్టైశ్వర్య సంపన్నుఁ డైన చక్రవర్తి యెట్టికొఱఁతలు లేనివాఁడయ్యును వినోదమునకై యొకవిధమైన సంతోషానుభవమునకై తన పోష్యవర్గములోని వారిని గొందఱఁ గలుపుకొని కందుక క్రీడ లాడును. ఆచెండాటలాడిన నాయనకు రాఁగల లాభములేదు. ఆడకుండిన రాఁగల నష్టియు లేదు. దానివలన ప్రయోజన మేదియులేదు. వినోదముగ నానందముతోఁ గాలము గడుపుటయే యుద్దేశము. అటులే నీవీ ప్రపంచక్రీడ యాడుచున్నాఁడవు నీవుప్రపంచవ్యవహారము కల్పించుకొనుట వినోదార్థమేకాని ప్రయోజనార్థముగాదు. నమోనమ ఏకశిలావాసా పాలిత వాసుదాసా రామచంద్ర ప్రభో నమోనమః.

**(సశేషము).**

## వార్త.

అనంతపురముజిల్లా కనగానపల్లి, వేదాంతము లక్ష్మయ్యగారు, సంజీవని **"అనేకతప్పులను వ్రాయుచు దేశద్రోహమొనరించు చుండుటచేత"** నవి తెలిపి సవరింపఁజేయుటకై తాము రాఁగల శ్రీరామనవమినాఁడు వచ్చెదమనియు ఆనాఁడు వాసుదాసుఁ డెందుండునది తెలుపవలయుననియు "భక్తి సంజీవనిద్వార ఈవార్త యందఱకుఁ దెలుపవలయు ననియు నేను తప్పక వచ్చుచున్నాననియు" తేదీ లేని కార్డు వ్రాసియున్నారు. శ్రీరామనవమినాఁడు లక్ష్మీనరసా పురమందే యుండుననియుఁ దప్పక రావలసిన దనియు నతనితప్పులను సవరించి యజ్ఞానము తొలఁగించువారు నేఁటికి మీరుదొరకితిరనియు వాసుదాసుఁడుగారు ప్రత్యుత్తర మిచ్చిరి. ఈవివరము వైశాఖపత్రిక వెల్లడించును.

## మందరపూర్తి.

శ్రీ సీతారామచంద్రమూర్తుల కరుణాకటాక్ష వీక్షణమువలన నేఁటికి నుత్తరకాండ వ్యాఖ్యానముకూడ నెఱవేఱినది. ఇది కేవల శ్రీరామచంద్రమూర్తి కటాక్షమున నైన కార్యమేకాని వాసుదాసుని పురుష కారముచే నైన కార్యము కాదు. ఇది యనుభవముచే సిద్ధాంతితము. బాలకాండ వ్యాఖ్య యొంటిమిట్ట వాల్మీకాశ్రమమున రచింపఁబడి స్వామి కర్పించిన సాయంకాలమే వాసుదాసుఁడు భయపడుచుండినట్లు హాలాహలము జనించెను. అది యిప్పటికిఁ బూర్ణముగాఁ జల్లారుటయేకాక గ్రంథము సొంతమైనది. అమృతముసిద్ధమై వెలువడినది - విబుధులు భోక్తులు సిద్ధపడియున్నారు. వడ్డించుటకు మోహినీ దేవత రావలసియున్నది. అయోధ్యాకాండ వ్యాఖ్య మేలుపట్టునందు మ-రా-శ్రీ, సి. దొరసామినాయుఁడుగారి మందిరమున వ్రాయఁ బడెను. ఆరణ్యకాండము నడిగడ్డపాళెము నాశ్రమమం దెట్లెట్లో నెఱవేఱెను. ఆవల నొకసంవత్సర మీ

కార్యము జరగినదికాదు. వాసుదాసుఁడు భగవత్క టాక్షము లేదేమో ఈకార్యము నెఱవేర్చుభాగ్యము తనకు లేదేమో యని విచారపడుచుండు సమయమున కోలంక వీరవరము జమీందారుగారగు మ-రా-శ్రీ, రాజారావు రామాయమ్మగారు బహదరువారు వాసుదాసుని బిలిపించి ముందరకార్యము మాగ్రామమున నుండి పూర్తిచేయవలసినదని సెలవిచ్చిరి.

ఆ ప్రకారమె గడచిన ఆషాఢమాసమున నిచ్చటికివచ్చి యాకార్యమునందే మనస్సుంచి వ్రాయఁగా భగవత్క టాక్షమున నది నేఁటికి నెఱవేరెను. రాజాఅమ్మగారి కీసంకల్పము భగవత్ప్రేరితము. ఇచ్చట నుండుటవలన నీకార్యము నెఱవేఱినది కాని మఱియొక చోట నిది నెఱవేఱియుండదు. రాజా అమ్మగారు తొమ్మిదినెలలు తల్లి తనగర్భమునందలి శిశువును రక్షించునట్లు రక్షించిరి. పంద్రెండు సంవత్సరములుగ నింత విశ్రాంతిగా నింతనిర్విచారముగ వాసుదాసుఁ డొక చోట నుండినదిలేదు. ఇంత సహాయము చేసిన శ్రీరాజారావు రామాయమ్మరావు బహదర్ వారికి నితోధిక శ్రేయస్సు, నిశ్రేయము కలిగించునుగాక!

భగవానేవ స్వయమేవ కారయతే యన్నట్లు భగవంతుఁడు తనకార్యము చేయించుకొన్నాఁడు వాసుదాసుఁడు జన్మించిన కార్యము దీనితో ముగిసినదనియే తోఁచుచున్నది. అయినను మఱియొక యాఱు మాసము లొక్క చో మరలఁ గూర్చుండినఁగాని యుత్తరపీఠిక ముగియదు. అది నెఱవేఱినను నెఱవేఱకున్నను వ్యసనములేదు. ఇది ముగియఁగానే వాసుదాసుఁడు షేక్స్పియర్ మంత్రదండము (Majic waud) ను పాఱజేసినట్టు తన కలమును బాఱవేసి తపమునఁ గాలక్షేపము చేయఁదలఁచి యువ్విళ్ళూరుచుండెను గాని భగవత్సంకల్పము దాని కనుకూలపడునట్లు లేదు.

**అన్యథాశరణంనాస్తి, త్వమేవ శరణంమమ**
**తస్మా త్కా రుణ్య భావేన రక్షరక్షో జనార్దన.**

## నిత్యభోగము.

మ-రా-శ్రీ, బాలినేని చినరామప్పగారు, శ్రీ వరదాభయ కోదండరామస్వామివారి నిత్యభోగమునకు సమర్పించినది ర్పు, 50-0-0.
సుబ్బదాసుఁడు.

## గుంటూరు మాండలిక సాంవత్సరికసభ.

ఈ నెలలో జరగవలసిన యీ సభ యనివార్యకారణములచే నిలిచినది. జరుగుటకుముందు తెలుపఁబడును.

మ-రా-శ్రీ, పొమతరావు అనువారు భక్త సంజీవనికి ర్పు, 2-0-0 లు పంపిరిగాని పైవిలాసము వ్రాసినవారుగారు. దయయుంచి చిఱునామా తెలుపుదురుగాక.